కోట్లు కుమ్మరించినా గుంతలే!


కొలమాసనపల్లి-నెల్లిపట్ల రోడ్డు దుస్థితి


బైరెడ్డిపల్లి మండలంలో గుంతలమయమైన కడపనత్తం రోడ్డు

- తూతూమంత్రంగా మరమ్మతులు
- సగం రోడ్లపై ఇప్పటికీ గుంతలే
- ప్రజలకు తప్పని ప్రయాణపాట్లు

పలమనేరు: సంక్రాంతి పండుగకు బయటి ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చే అల్లుళ్లు ఇక్కడున్న రోడ్లను చూసి ఆనందపడతారని సీఎం చంద్రబాబు చెప్పిన మాట. కానీ కోట్లాది రూపాయల వ్యయంతో వేసిన రోడ్లు పలుచోట్ల నాశిరకంగా ఉండగా మరికొన్ని చోట్ల అసలు ప్యాచ్ వర్కులు సైతం వేయలేదు. దీంతో గుంతలమయమైన రోడ్లు, బాగుపడని రోడ్ల దుస్థితిని చూసి కూటమి ప్రభుత్వం చెప్పిన మాటేమిటి, ఇక్కడ ఉన్న పరిస్థితేంటని జనం మండిపడుతున్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.4.13కోట్లు

పలమనేరు నియోజకవర్గంలో 250 కి.మీల తారురోడ్లు ఉండగా వాటిలో 60శాతం రోడ్లు వర్షాల కారణంగా అధ్వాన్నంగా మారాయి. కానీ కూటమి ప్రభుత్వం ఇక్కడ రూ.4.13కోట్లతో 6,395 మీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు నిధులను మంజూరు చేసింది. చేపట్టిన పనులు సైతం నాశిరకంగా అంతంతమాత్రంగానే వేశారు.

వి.కోట, పెద్దపంజాణి మండలాల్లో మాత్రమే...

వి.కోట మండలంలోని ముదరందొడ్డి, ఎస్.బండపల్లి, బైరుపల్లి, పాముగానిపల్లి, పెద్దపంజాణి మండలంలోని చామనేరు రోడ్లలో మరమ్మతులకు సంబంధించి రూ.4.13 కోట్లతో 6,395 మీటర్ల మరమ్మతులకు నిధులను మంజూరు చేశారు. దీంతో ఈ పనులు దక్కించుకున్న కూటమి కాంట్రాక్టర్లు సైతం వారికి సొమ్ము మిగిలేలా పైపై సొగసులు చేసి తూతూమంత్రంగానే పనులు చేశారు. ఇవి మరో నెలకూడా ఉంటాయనే నమ్మకం లేదు.

నెల్లిపట్ల రోడ్డును చూడండి సారూ...

పలమనేరు నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి ఘోరంగా తయారైంది. బైరెడ్డిపల్లి మండలంలోని నెల్లిపట్ల రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. ఈమార్గంలో తారురోడ్డుకిరువైపులా రెండు అడుగుల గుంతలు కనిపిస్తున్నాయి. వాహనాలు కనీసం సైడ్‌కు దిగాలన్నా కుదరడం లేదు. ఇక ఇదే మండలంలోని కడపనత్తం రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లడం కష్టతరమైంది.పెద్దపంజాణి మండలంలోని చెన్నారెడ్డిపల్లి, అప్పినపల్లి రోడ్లకు గుంతలు పడ్డాయి. ఈ మార్గంలో ద్విచక్రవాహనాల్లో వెళ్లాలన్నా వీలుకాని పరిస్థితి నెలకొంది. వి.కోట మండలంలోని గెస్తింపల్లి రోడ్డు మరీ ఘోరంగా మారింది. ఇక వి.కోట నుంచి అంతర్రాష్ట్ర రోడ్డుగా ఉన్న కేజీఎఫ్ రోడ్డుపై తాజాగా రోడ్డుకు వేసిన మరమ్మతులు అప్పుడే దెబ్బతిన్నాయి. నియోజకవర్గంలో సగానికిపైగా మరమ్మతులకు గురైన రోడ్లను అసలు పట్టించుకోకుండా కొన్ని రోడ్లలో మాత్రం తూతూమంత్రంగా రోడ్ల మరమ్మతులు చేశామని కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం మినహా వాస్తవంగా పూర్తిస్థాయిలో రోడ్ల మరమ్మతులు జరగలేదనేది ఆయా రోడ్లపై వెళ్లే గ్రామస్తులను అడిగితే తెలుస్తుంది.

క్లుప్తంగా

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

పెద్దపంజాణి: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 80 యూనిట్లు మంజూరయ్యాయని ప్రభుత్వం గరిష్ఠంగా 50 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21-60 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. కాపు కార్పొరేషన్ వారికి మాత్రం వయస్సు 21-50 ఏళ్ల మధ్య ఉండొచ్చన్నారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయం లేదా సచివాలయాలలో సంప్రదించాలని కోరారు.

నేడు కుప్పానికి ఆదిచంచనగిరి మఠాధిపతి


మంగళానందనాథ స్వామీజీ

గుడుపల్లె: కర్ణాటక రాష్ట్రం ఆదిచంచనగిరి మఠాధిపతి మంగళానందనాథ స్వామిజీ నేడు ఆదివారం కుప్పంకు రానున్నట్లు కుప్పం నియోజకవర్గ వక్కలిగకుల సేవా సంఘం అధ్యక్షుడు రాజగోపాల్ తెలిపారు. కుప్పం సోమేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం బహిరంగసభలో స్వామిజీ తీర్థప్రసాదాల స్వీకరణ నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను పొందనున్నారు.

కుష్ఠు నిర్మూలనకు సహకరించాలి


అవగాహన కల్పిస్తున్న కాంతమ్మ

బైరెడ్డిపల్లె: కుష్ఠు నిర్మూలనకు ప్రజలు సహకరించాలని తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ పేర్కొన్నారు. తీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. హెచ్ఎం చిట్టిబాబు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే కానీ స్పందించరా!


డ్యాం వద్ద ప్రమాదకరంగా ఉన్న ప్రాంతం

చౌడేపల్లె: చౌడేపల్లె-తిరుపతి ప్రధాన రహదారిలోని డ్యామ్ వద్ద (ఎర్రనాగులపల్లె క్రాస్ సమీపంలో) ప్రమాదం జరిగితే కానీ స్పందించరా అంటూ ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. రోడ్డు పక్కన కల్వర్టుపై గుంతపడింది. వాహనదారులు కాస్త ఆదమరిస్తే పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోబీఘాట్ అభివృద్ధికి చర్యలు తీసుకోండి


ఈడీ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

పుంగనూరు: పట్టణంలోని దోబీఘాట్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రజక సంఘ నాయకులు శనివారం చిత్తూరులో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దోబీఘాట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఆక్రమణల సమస్యలను తొలగించాలని కోరారు. అలాగే దోబీఘాట్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నాయకులు షణ్ముగం, రమేష్‌బాబు, నాగరాజు, గణేష్, శ్రీనివాసులు, వెంకట్రమణ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి


సమావేశంలో జడ్జిలు ఆరీఫాషేక్, కృష్ణవంశి

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో మార్చి 8న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫాషేక్ పిలుపునిచ్చారు. శనివారం కోర్టు ఆవరణలో అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి కృష్ణవంశితో కలసి ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి ఆరీఫాషేక్ మాట్లాడుతూ లీగల్ సర్వీసస్ అథారిటీ ఆదేశాల మేరకు లోక్‌అదాలత్‌ను నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరిస్తామన్నారు. సివిల్, క్రిమినల్, కుటుంబం, బ్యాంక్‌లకు సంబంధించి కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు సహకరించి, అధికస్థాయిలో కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని కోరారు. సీఐ శ్రీనివాసులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దాతల సేవలు వెలకట్టలేనివి


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు, ఎంఈఓ

వి.కోట: విద్యాభివృద్ధికి దాతలు చేసే సేవలు వెలకట్టలేనివి అని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కుంబార్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కల్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆసంస్థ చైర్మన్ పవన్‌కళ్యాణ్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం 39మంది 10 తరగతి విద్యార్థులకు దాతలు, ఎంఈఓ చేతుల మీదుగా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్, స్కేల్ వంటి విద్యా సామగ్రిని అందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం రఫీ, సంస్థ సభ్యులు మనోహర్‌రెడ్డి, ఇమ్రాన్, మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం


ఫీజు పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వెంకటేగౌడ, విద్యార్థి విభాగం నేతలు

- 5న ఫీజు పోరును విజయవంతం చేద్దాం

పలమనేరు: ఏడు నెలల ప్రజల బాధలు చూసిన తర్వాత ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. త్వరలో జనమే ఈ ప్రభుత్వంపై పోరుబాటుకు సిద్ధమవుతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఈనెల 5న జరిగే పోరుబాట పోస్టర్లను నియోజకవర్గ విద్యార్థి విభాగం నేతలతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఇప్పటి దాకా కూటమి ఇచ్చిన హామీ మేరకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెనలకు సంబంధించి రూ.3900 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. విద్యార్థుల పక్షాన వైఎస్సార్‌సీపీ ఈ పోరుబాటను చేపడుతోందని దీన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమాల్లో నాయకులు మొగసాల క్రిష్ణమూర్తి, మండీ సుధా,మురళీకృష్ణ, చెంగారెడ్డి,ముజ్జు, నరేష్, శ్యామ్, రాజారెడ్డి, రెడ్డెప్ప రెడ్డి పాల్గొన్నారు.

పరస దుకాణాలకు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో నిర్వహించే పరస దుకాణాలకు శనివారం పంచాయతీ అధికారులు వేలం పాట నిర్వహించారు. వేలం పాటను ఈఓ శివశంకర్, సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా రూ.1.17లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు, ఆలయ ధర్మకర్త సీతారామయ్య, వార్డు సభ్యులు కుమార్‌రాజా, శశికళ పాల్గొన్నారు.

అనధికార లేఔట్లపై చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి


అక్రమ లేఔట్లను పరిశీలిస్తున్న కమిషనర్

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని అనధికారిక లేఔట్లపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. ఆమేరకు టీపీఓ ఇందిరతో కలసి శనివారం ఆయన పలు అక్రమ లేఔట్లను పరిశీలించారు. పట్టణంలో 36 లేఔట్లకు అనుమతులు లేవని గుర్తించామని ఈ యజమానులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. అనుమతులు లేని లేఔట్లలోని ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని తెలిపారు. దీంతోపాటు ఈ స్థల క్రయవిక్రయాలు సైతం ఇకపై సాగవని స్పష్టం చేశారు.

ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

చౌడేపల్లె: రైతులందరికీ పంట నమోదు (ఈక్రాప్ బుకింగ్)తోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ సూచించారు. శనివారం చౌడేపల్లె రైతుసేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పంట క్రాప్‌బుకింగ్‌తోపాటు ఈకేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే ఇన్సూరెన్స్ పొందే అవకాశం ఉందన్నారు. పంట నమోదు ప్రకియను ఈనెలాఖరులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. పంటలకు ప్రధానంగా సోకే తెగుళ్లను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలిచ్చి అధిక దిగుబడులు సాధించడానికి అవగాహన సదస్సులు ఏర్పాటుచేయాలన్నారు. ఏఓ జ్యోతమ్మ పాల్గొన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న పీపీఎస్ నేతలు

పలమనేరు: పట్టణంలోని ఏపీఎన్జీఓ కార్యాలయంలో నేడు ఆదివారం జరిగే పలమనేరు పరిరక్షణ సమితి ఏడో వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఇందుకు సంబంధించి శనివారం ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణ సమస్యలపై పీపీఎస్ పోరాటాలు చేసిందని ఇకపై కూడా చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారికి సేవా పురష్కారాలను అందించనున్నట్టు తెలిపారు. ఇందులో సంఘ సేవకులు సీతారామయ్య, ఏపీఎన్జీఓ నేతలు ఆనందబాబు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతిచెందిన శివకుమార్

చౌడేపల్లె: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పుంగనూరు మండలం చదళ్లకు చెందిన శివకుమార్(27) చౌడేపల్లె మండలం పాదలపల్లె సమీపంలో గల కోళ్లఫారంలో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో ఏమి జరిగిందో కానీ కోళ్లఫారం ఆవరణంలో గల ఓ గదిలో వేళాడుతుండగా గమనించిన సహచరులు కిందకు దింపారు. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. కాగా శివకుమార్ మృతిపై పలు అనుమానాలున్నాయని మృతుని కుటుంబీకులు తెలిపారు. విషయం తెలిసి ఎస్ఐ నాగేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న రైతు దీక్షలు


27వ రోజు దీక్షలో రైతులు

కుప్పం రూరల్: కుప్పం మండలం, ఆవులనత్తం వద్ద ఉన్న జెల్లి ఫ్యాక్టరీ నిర్వహణ వల్ల తమకు తీరని నష్టం కలుగుతోందని స్థానిక రైతులు దీక్షలు చేపడుతున్న విషయం విధితమే. 27న రోజులుగా దీక్షలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ నిర్వహణ వల్ల పంటలకు, ప్రాణాలకు తీరని నష్టం కలుగుతుందని, దీక్షలు చేపడుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అధికారుల ముందర కాళ్లకు బందాలు వేయడంతోనే ఎవరు తమ గోడు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మొరాయించిన సర్వర్



నాయునివారిపాళ్యం వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు, బైరెడ్డిపల్లె: పింఛన్ల కోసం నిరీక్షణ

- ఆలస్యంగా పంపిణీ
- గంటల తరబడి నిరీక్షణ

చౌడేపల్లె: పింఛన్లు పంపిణీ చేసేందుకు ఉదయాన్నే కేటాయించిన క్లస్టర్‌లకు అధికారులు వెళ్లినప్పటికీ సర్వర్ సమస్య కారణంగా వృద్ధులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం పింఛన్ల పంపిణీ ప్రకియ ఆలస్యంగా సాగింది. గంట సమయంలో కేవలం నలుగురు లేదా ఆరుగురికి మాత్రమే పంపిణీ చేశారు. తమకెప్పుడు అందుతుందో నంటూ వృద్ధులు ఎదురుచూశారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పంపిణీ ప్రకియ ఆలస్యంగా జరగడంతో వృద్ధులు అవస్థలు పడ్డారు. సిగ్నల్స్ సమస్య కారణం ఏమోనని అధికారులు సిగ్నల్స్ ఉన్న చోటకు రప్పించి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో తమ ఇంటి వద్దకే వలంటీర్లు పింఛన్లు తెచ్చి ఇచ్చే వారని ఇలా ఇబ్బంది పడేవారం కాదని పింఛన్‌దారులు గుసగుసలాడారు.

బైరెడ్డిపల్లె: ఉదయాన్నే పింఛన్లు అందిస్తారని ఎదురు చూసిన పింఛన్‌దారులకు నిరాశే ఎదురైంది. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు సర్వర్లు పనిచేయకపోవడంతో మంచులోనే ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 9 గంటలపైన సర్వర్లు పనిచేయడంతో పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు నానా అగచాట్లు పడుతూ పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

యాదవుల అభివృద్ధికి కృషి


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నేతలు

వి.కోట: యాదవులంతా ఒకే దాటిపై ఉంటూ తమ సంఘం అభివృద్ధికి కృషిచేయాలని సీనియర్ ఉపాధ్యాయుడు లోకనాథం కోరారు. శనివారం పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో మండల యాదవుల ఆధ్వర్యంలో యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆ కుల ఉద్యోగులు యాదవుల్లోని విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషిచేసి తమ సంఘ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం క్యాలెండర్లను అందరికీ అందజేశారు. జిల్లా కార్యదర్శి శంకర్‌యాదవ్, మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, రమేష్ యాదవ్, ప్రభాకర్‌యాదవ్, రఘుపతి యాదవ్, రామచంద్రప్ప యాదవ్, అమరావతి, స్వాతి, వాణి, మునిశేఖర్‌యాదవ్, నాగరాజ్‌యాదవ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గుడుపల్లె: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం నిరుద్యోగులు ఈనెల 7వ తేదీ లోపు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. బీసీ కేటగిరీలకు సంబంధించిన నిరుద్యోగులు 21 నుంచి 60 సంవత్సరాలలోపు ఉన్న ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



సదుం: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ జబ్బార్ సాహెబ్ (86) వయోభారంతో మృతిచెందారు. ఆయన మృతదేహానికి పలువురు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

హరిత స్ఫూర్తి.. కల్లూరు దీప్తి


పాఠశాల ఆవరణలోని పచ్చటి చెట్లు

- నాల్గవ సారి కల్లూరు ఉన్నత పాఠశాలకు జాతీయ హరిత అవార్డు
- 4న న్యూఢిల్లీలో అవార్డు ప్రదానం
- సమష్టి కృషితో నాలుగు సార్లు అవార్డు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గత నాలుగేళ్లుగా వరుసగా జాతీయ స్థాయిలో హరిత అవార్డు రావడం జరిగింది. కల్లూరు పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ హరిత పాఠశాల కార్యక్రమంలో ప్రధాన భాగాలైన వాటర్, ల్యాండ్, ఎయిర్ మేనేజ్‌మెంట్‌తోపాటు పలురకాల మొక్కలను పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, దాతల సహకారంతో పచ్చదనం సంతరించుకుంది. దీనితో పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. జాతీయ స్థాయిలో పాఠశాలలో చేపట్టిన పనులన్నీ పరిగణలోకి తీసుకొని అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 4న ఇండియా హ్యాబిటేట్ న్యూఢిల్లీలో సెంటర్‌ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో డైరెక్టర్ సునీత సరైన్ చేతుల మీదుగా అవార్డు అందజేస్తారు. పాఠశాల తరపున అవార్డు అందుకోవడానికి గ్రీన్‌మాస్టర్ వనపర్తి వెంకటసిద్దులుకు ఆహ్వానం అందినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు.

అందరి సహకారంతోనే అవార్డు..గ్రీన్‌మాస్టర్



నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో పాఠశాలలో నిరంతరం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ వివిధ రకాల మొక్కలను నాటి పచ్చదనం పెంపొందిస్తుంటాం. పాఠశాలలో పరిశుభ్రత పాటించి చక్కటి వాతావరణం కల్పించాం. జిల్లాలో మొదటి స్థానం జాతీయ స్థాయిలో రావడం కారణమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

–వెంకట సిద్దులు, జెడ్పీ ఉన్నత పాఠశాల, కల్లూరు

ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం..



పాఠశాలను అన్నిరకాలుగా ఆకర్షనీయంగా తీర్చిదిద్దాం. పాఠశాలలో పచ్చదనంతోపాటు పర్యావరణం, పరిశుభ్రత సంతరించుకొంది. పలుకార్యక్రమాలు నిరంతరం చేపట్టడంతో వరుసగా నాలుగు సార్లు అవార్డులు వచ్చింది.

–డివిజనల్ కన్వీనర్, రాజేంద్ర, జెడ్పీ హైస్కూల్, కల్లూరు

సమష్టి కృషితో అభివృద్ధి..



ఉపాధ్యాయులు, విద్యార్థులు, దాతల సహకారంతో పాఠశాలను పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం. పాఠశాలకు వరుసగా నాలుగు సార్లు అవార్డు రావడం గర్వంగా ఉంది. సహకరించిన అందరికీ అభినందనలు.

–శ్రీవాణి, హెచ్ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల, కల్లూరు